క్లుప్తంగా

అంకితభావంతో పనిచేస్తేనే గుర్తింపు



ఉద్యోగులను సత్కరించిన హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

దెందులూరు: విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసే ప్రతి ఒక్కరికీ గుర్తింపు ఉంటుందని స్థానిక గారపాటి హైమావతి దేవి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం జి.మల్లికార్జునరావు అన్నారు. ఈ హైస్కూల్ నుంచి బదిలీపై వెళ్లిన రికార్డ్ అసిస్టెంట్ ఎ.మధుసూదనరావు, లైబ్రరీ అసిస్టెంట్ పి.శోభారాణి, ఆఫీసు సబార్డినేట్ ఎ.నటరాజుకు వీడ్కోలు పలికారు. పాఠశాలకు రికార్డు అసిస్టెంట్‌గా బదిలీపై వచ్చిన గుళ్లపూడి వెంకటేశ్వరరావుకు స్వాగతం పలికారు. వీరందరినీ శాలువాలతో సత్కరించారు. పాఠశాలలో సోమవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఫస్ట్ అసిస్టెంట్ జీవీవీ నారాయణ, స్టాఫ్ సెక్రటరీ సీహెచ్ ఆశీర్వాదం, సుధీర్, భాస్కర్ ప్రసాద్, లావణ్య, కళ్యాణి, పద్మజా కుమారి, ప్రభుపాల్, విద్యార్థులు పాల్గొన్నారు.

దేవుని పట్ల భయభక్తులు కలిగి ఉండాలి



మాట్లాడుతున్న ప్రముఖ సువార్తీకుడు ప్రేమరాజు

దెందులూరు: ప్రతి మనిషి ఆలోచనా విధానం మారాలని, దేవుని పట్ల భయభక్తులు కలిగి ఉండి నిరంతర ప్రార్థనతోనే మోక్ష మార్గం, వ్యక్తి జీవిత పరమార్థం లభిస్తుందని ప్రముఖ సువార్తీకుడు ప్రేమరాజు అన్నారు. సోమవారం అప్పారావుపాలెం గ్రామంలో పాస్టర్ ఎలీషా ఆధ్వర్యంలో వారం రోజులు ఉపవాస పండుగలు ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథి ప్రేమరాజు మాట్లాడుతూ తనను తాను ప్రేమించినట్టే ఎదుటి వారి పట్ల దయ, ప్రేమతో ప్రతి మనిషి ఉండాలని, సమాజ సేవతో పాటు ఆధ్యాత్మిక అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. సన్మార్గం వైపు పయనించాలని, నిరంతర ప్రార్థనలో జీవించాలని సూచించారు. దెందులూరు, భీమడోలు, పెదవేగి, ఏలూరు మండలాల నుంచి విశ్వాసులు హాజరయ్యారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు



సమస్య వింటున్న తహసీల్దార్ సుమతి

దెందులూరు: ప్రతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని తహసీల్దార్ బి.సుమతి అధికారులకు సూచించారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ప్రజల నుంచి వివిధ సమస్యలపై వినతులు స్వీకరించారు. మాగంటి నారాయణ ప్రసాద్ (మిల్లుబాబు), తదితరులు ఉన్నారు.

నేడు కేంద్రీయ విద్యాలయంలో లాట్-2 పరీక్షలు

దెందులూరు: గోపన్నపాలెంలోని కేంద్రీయ విద్యాలయంలో కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు లెర్నింగ్ అచీవ్‌మెంట్ పరీక్షలు నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ వీఎస్ మీనా తెలిపారు. సోమవారం ఆయన కేంద్రీయ విద్యాలయలో మాట్లాడుతూ 3, 5, 8వ తరగతి విద్యార్థులకు ఈ పరీక్షలు నిర్వహిస్తున్నామని, ఉదయం 11 గంటలకు పరీక్షలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు.

పశుసంపద ద్వారా రైతులకు ఆదాయం



శిబిరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధర్మరాజు

గణపవరం: పశు సంపద ద్వారా గ్రామీణ ప్రాంత రైతు కుటుంబాలకు అదనపు ఆదాయం చేకూరుతుందని, అందువల్ల పశువుల పెంపకాన్ని ప్రోత్సహించాలని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. సోమవారం గణపవరం పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జిల్లాపశు గణాభివృద్ధి సంస్థ సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్సా శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి మురళీకృష్ణ మాట్లాడుతూ తమ శాఖ ద్వారా అమలవుతున్న పథకాలను వివరించారు. రైతుసేవాకేంద్రాల ద్వారా అందుతున్న సేవలను రైతులు ఉపయోగించుకోవాలని కోరారు. శిబిరంలో 125 పశువులకు పరీక్షలు నిర్వహించి, రైతులకు మందులు అందజేశారు. కార్యక్రమంలో వెటర్నరీ శాఖ ఏడీ డీఎం నాయక్, ఎంపీడీఓ బేబీ శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కాలనీల రహదారులు ఛిద్రం

- ఏటిగట్ల రోడ్లదీ ఇదే దుస్థితి
- ఏలూరు, దెందులూరు నియోజకవర్గాల్లోని పేదల రాకపోకలకు ఇబ్బందులు
- రోడ్ల నిర్మాణాన్ని పట్టించుకోని పాలకులు

ఏలూరు (టూటౌన్): ఏలూరు నగరంలోని పలు కాలనీలకు వెళ్లే రోడ్లు, వీటితోపాటు ఏటిగట్టు రోడ్లు ఛిద్రంగా మారాయి. చినుకు పడితేచాలు బురదమయంగా మారుతున్నాయి. వీటిపై కనీసం నడిచి వెళ్లాలన్నా వీలుపడని దుస్థితి నెలకొంది. ఇటీవల అల్పపీడనాలు, వాయుగుండాల కారణంగా కురుస్తోన్న వర్షపు జల్లులకు రోడ్లన్నీ జర్రుబుర్రులాడుతున్నాయి. ద్విచక్రవాహనంపై వెళ్లాలన్నా జారిపోయే పరిస్థితి ఏర్పడింది. దీంతో కాలనీల్లో ఉంటున్న నిరుపేదలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే మొదటి ప్రాధాన్యతగా రోడ్లు నిర్మిస్తామన్న పాలకుల హామీ కాగితాలకే పరిమితమైంది. 100 రోజుల పాలనంటూ గొప్పగా ప్రచారం చేసుకుంటున్న ప్రజాప్రతినిధులు, అధికారులకు తమగోడు పట్టడంలేదని కాలనీ ప్రజలు వాపోతున్నారు. కనీస వసతులైన రోడ్లు, డ్రెయిన్లు వంటివి నిర్మించాలని వారు కోరుతున్నారు.

పేదలకు పాట్లు

ఏలూరు కార్పొరేషన్ పరిధిలో పలు కాలనీలు ఉన్నాయి. ప్రధానంగా స్థానిక 19వ డివిజన్‌లోని శ్రీనివాస కాలనీ, దెందులూరు నియోజకవర్గంలోని పోణంగి కాలనీ, కొమడవోలులోని వైఎస్సార్ కాలనీ ఇలా అన్నీ కాలనీల్లోనూ నూటికి 95 శాతానికి పైగా నివశించేది నిరుపేదలే. వీరందరూ ప్రతి రోజూ ఉదయం పనుల కోసం బయటకు వచ్చి తిరిగి సాయంత్రం తమ ఇళ్లకు చేరతారు. ఛిద్రంగా మారిన రోడ్లపై రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



19వ డివిజన్ శ్రీనివాస నగర్‌కు వెళ్లే రోడ్డు దుస్థితి



అధ్వానంగా ఉన్న శ్రీనివాస నగర్‌కాలనీ లోపల రోడ్డు



కొత్తూరు జూట్ మిల్లుకు వెళ్లే ఏటిగట్టు రోడ్డు

కనీస సౌకర్యాలు కల్పించాలి



ఏలూరు నగరపాలక సంస్థ పరిధిలో ప్రభుత్వం నిర్మించిన కాలనీల్లో కనీస సౌకర్యాలు పూర్తిస్థాయిలో కల్పించాలి. ప్రధానంగా రోడ్లు, డ్రెయినేజీలు, తాగునీరు, విద్యుత్ వంటి సౌకర్యాలు పూర్తిగా అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉంది. పేదల సంక్షేమానికి పాలకులు చిత్తశుద్ధితో పనిచేయాలి. పేదల కాలనీల పట్ల నిర్లక్ష్యం తగదు.

– పి.కిషోర్, ఏలూరు నగర కార్యదర్శి, సీపీఎం

చినుకు పడితే ఛిద్రమే



పేదల కాలనీల్లో చినుకు పడితే రోడ్డుపై నడిచి వెళ్లే పరిస్థితి ఉండదు. కాలనీల్లో కనీస సౌకర్యాలు కల్పించి పాలకులు తమ చిత్తశుద్ధిని చాటుకోవాలి. హనుమాన్ నగర్ నుంచి కొత్తూరు జూట్ మిల్లు వైపు పెదపాడు రోడ్లో వెళ్లాలంటే శ్రీనివాస్ నగర్ మీదుగా వెళ్లాల్సి ఉంది. ఈ కాలనీలో రోడ్లన్నీ పాడైపోయాయి. పిల్లలు స్కూల్స్‌కి వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారు.

– సీహెచ్ రాజ్యలక్ష్మి, హనుమాన్ నగర్, ఏలూరు

నేటి నుంచి ఆధార్ మొబైల్ శిబిరాలు

నిడమర్రు: ఆధార్ కార్డుల్లో మార్పులు, చేర్పులు, కొత్తగా నమోదుకు మండలంలో మంగళవారం నుంచి ఈనెల 25 వరకు ఆధార్ మొబైల్ శిబిరాలు నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ విజయకుమారి తెలిపారు. 21న చానమిల్లి, 23న అడవికొలను, 24, బువ్వనపల్లి, 25న మందలపర్రు గ్రామాల్లో ఆధార్ మొబైల్ శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు.

నేడు ఉంగుటూరులో..

ఉంగుటూరు: ఉంగుటూరు మండలంలో నేటి నుంచి ఆధార్ శిబిరాలు నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ మానోజ్ తెలిపారు. 22న ఉంగుటూరు, 23న నారాయణపురం, 24న గొల్లగూడెం, 25న కైకరం గ్రామ సచివాలయాల్లో ఆధార్ శిబిరాలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. నిత్యం ఉదయం 9నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించే ఈ శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ కోరారు.

12 మంది అధికారులకు నోటీసులు

దెందులూరు: ప్రతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికకు గైర్హాజరవుతున్న 12 మంది మండల అధికారులకు నోటీసులు జారీ చేస్తున్నట్టు ఎంపీడీఓ కె.శ్రీదేవి తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రతి సోమవారం విధిగా అన్ని శాఖల మండలాధికారులు తహసీల్దార్ కార్యాలయానికి హాజరుకావాల్సి ఉందని అన్నారు. నిబంధనలకు విరుద్ధంగా రెగ్యులర్‌గా పలువురు అధికారులు గైర్హాజరవుతున్నారని తెలిపారు. మంగళవారం 12 మంది అధికారులకు నోటీసులు జారీ చేసి సీఈఓకు, జిల్లా కలెక్టర్‌కు నివేదిక అందజేస్తామని ఎంపీడీఓ వివరించారు.

పోలీస్ అమరవీరుల త్యాగం అజరామరం

భీమడోలు: పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం భీమడోలు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గ్రామ పురవీధులో ర్యాలీ, గాంధీబొమ్మ సెంటర్ వద్ద మానవహారం నిర్వహించారు. తొలత ర్యాలీని ఎస్సై వై.సుధాకర్ ప్రారంభించారు. ప్రజా రక్షణలో అలుపెరగని పోరాటం చేసి ఉగ్రవాదులు, అల్లరి మూకల దాడిల్లో ఎందరో పోలీసులు అసువులు బాసారని ఆయన గుర్తుచేశారు. వారి త్యాగాలను మరవలేనివన్నారు. స్నేహపూర్వక వాతావరణంలో పోలీసులు అందించే సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తొలుత పోలీస్ అమరవీరులకు నివాళులర్పించారు. భీమడోలు శ్రీవెంకటేశ్వర డిగ్రీ, జూనియర్ కళాశాలల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, ప్రిన్సిపాల్స్ బొమ్ము రవికుమార్, మాధవి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. పోలీస్ అమర వీరులకు జోహర్లర్పించారు.

వారి త్యాగం, సేవలు మరువలేనివి

నిడమర్రు: విధి నిర్వహణలో అశువులు బాసిన పోలీసు అమరులను స్మరించుకోవడం మన బాధ్యత అని, వారి త్యాగం, సేవలు మరువలేనివని నిడమర్రు ఎస్సై వీర ప్రసాద్ అన్నారు. సోమవారం అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా నిడమర్రు జెడ్పీస్కూల్లో నిర్వహించిన సభలో ఎస్సై మాట్లాడారు. ప్రజాశ్రేయస్సు, శాంతి భద్రతలే లక్ష్యంగా ముందుకెళుతున్నామని, పోలీసులకు ప్రజల సహకారం అవసరమని అన్నారు. నిడమర్రులో విద్యార్థులు, గ్రామస్తులతో ర్యాలీ, అనంతరం ప్రధాన కూడలిలో మానవహారంగా ఏర్పడి అమరులైన పోలీసులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్, రాజేష్, సిబ్బంది శ్రీను, దుర్గారావు, ఉపాధ్యాయులు ఉన్నారు.

అమరవీరుల ఆశయసాధనకు కృషి

గణపవరం: పోలీసు అమరవీరుల ఆశయసాధనకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని, వారి ఆశయబాటలో నడవాలని పలువురు పిలుపునిచ్చారు. పోలీసు అమరవీరుల సంస్మరణదినోత్సవం సందర్భంగా సోమవారం గణపవరం పోలీస్‌స్టేషన్ వద్ద అమరవీరులకు ఎస్సై మణికుమార్, పోలీసు సిబ్బంది నివాళలర్పించారు. విద్యార్థులు, పోలీసు సిబ్బంది, స్వచ్ఛందసంస్థల సభ్యులు గణపవరం పోలీస్ స్టేషన్ వద్ద నుంచి ప్రదర్శన చేశారు. గణపవరం పోలీస్ ఐలెండ్ సెంటర్‌లో మానవహారంగా ఏర్పడ్డారు.

పోలీస్ అమరవీరులకు నివాళి

దెందులూరు: ప్రాణ త్యాగం చేసిన పోలీసులు అమరజీవులని స్థానిక బీఆర్‌డీ నర్సింగ్ కళాశాల కరస్పాండెంట్ సుగ్గిశెట్టి నూకరాజు అన్నారు. సోమవారం దెందులూరు నర్సింగ్ కళాశాలలో పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహించారు. నర్సింగ్‌విద్యార్థులు జాతీయ జెండాలు పట్టుకుని ర్యాలీ నిర్వహించారు. అధ్యాపకులు జూనియర్ సీనియర్ నర్సింగ్ విద్యార్థినులు ఉన్నారు.

పోలీసు అమరవీరుల త్యాగనిరతి స్ఫూర్తి

విధి నిర్వహణలో దేశం కోసం ప్రాణాలర్పించిన సీఆర్‌పీఎఫ్ పోలీసుల త్యాగనిరతి చరిత్ర ఉన్నంత కాలం గుర్తుంటుందని దెందులూరు ఎస్సై ఆర్ శివాజీ అన్నారు. సోమవారం దెందులూరు పోలీస్ స్టేషన్‌లో పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహించారు. రెండు నిమిషాలు అమర వీరుల సంతాప సూచికంగా మౌనం పాటించారు. వారి సేవలను, త్యాగనిరతిని, బలిదానాన్ని గుర్తుచేశారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుళ్లు హమీద్, గోపి, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.



భీమడోలు : గాంధీబొమ్మ సెంటర్‌లో పోలీసులు, విద్యార్థుల మానవహారం



దెందులూరు : పోలీస్ అమరవీరులకు నివాళులర్పిస్తున్న నర్సింగ్ విద్యార్థులు

రజక చెరువుల జీఓల అమలుకు డిమాండ్

ఏలూరు (టూటౌన్): గ్రామాల్లో రజకులకు కేటాయించిన వృత్తి చెరువుల విషయంలో అధికారులు ప్రభుత్వ జీఓలను తప్పకుండా అమలు చేయాలని రజక జన సంఘ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడు చిలకలపల్లి కట్లయ్య అన్నారు. స్థానిక రజక జన సంఘ జిల్లా కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశం సోమవారం నిర్వహించారు. దేవరపల్లి మండలం చిన్నాయగూడెం గ్రామం రజక సంఘ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. చిన్నాయగూడెం గ్రామ రజకులు మాట్లాడుతూ గ్రామంలో వృత్తి చెరువు సమస్యలను పరిష్కరించాలని కోరారు. దీనిపై కట్లయ్య మాట్లాడుతూ గ్రామ సంఘాలకు గ్రామ పంచాయతీలు కేటాయించిన చెరువుల్లో ఆక్రమణలను తొలగించాలన్నారు. ఇటీవల రాజమండ్రి ఎంపీ దగ్గుపాటి పురందేశ్వరి తమ గ్రామ పర్యటనకు వచ్చిన సందర్భంగా తమ సమస్యలను వివరించినట్టు రజక నేతలు తెలిపారు. అనంతరం రజక సంఘం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తాడిమల్ల శీను, ఉపాధ్యక్షుడిగా పెనుగుర్తి శీను, కార్యదర్శిగా పల్లంట్ల సత్యనారాయణ, పాలూరు పోసిబాబు, పల్లంట్ల నాగేశ్వరరావు, సభ్యులుగా గుంటుపల్లి అమ్మన్న, ఏడుకొండలు ఎన్నుకున్నారు.



రజక ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న కట్లయ్య

స్కూల్ అసిస్టెంట్ పోస్టులు మంజూరు చేయాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మున్సిపల్ పాఠశాలలకు స్కూల్ అసిస్టెంట్ పోస్టులు మంజూరు చేయాలని ఏపీటీఎఫ్ ఏలూరు నగర శాఖ అధ్యక్షుడు కురమా ఆనంద కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఈదర సుబ్బమ్మ దేవి మున్సిపల్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన ఆ సంఘం ఏలూరు నగర శాఖ సమావేశానికి ఆనంద కుమార్ అధ్యక్షత వహించి మాట్లాడారు. మున్సిపల్ ఉపాధ్యాయులకు జీపీఎఫ్ ఖాతాలను తెరవాలని కోరారు. ఉపాధ్యక్షుడు ఎల్‌వీపీఏ రత్నకుమార్ మాట్లాడుతూ మున్సిపల్ పాఠశాలల్లో స్పెషల్ ఎడ్యుకేషన్ చేసిన వారికి స్కూల్ అసిస్టెంట్ స్పెషల్ ఎడ్యుకేషన్ పోస్టులను మంజూరు చేయాలన్నారు. జిల్లా కౌన్సిలర్ వీవీ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ అసంబద్ధమైన వర్క్ అడ్జెస్ట్‌మెంట్‌ను సరిచేయాలని కోరారు. ప్రధాన కార్యదర్శి అబ్బదాసరి శ్రీనివాసరావు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న డీఏలను ప్రభుత్వం విడుదల చేయాలని, దీపావళి కానుకగా 30 శాతం మధ్యంత భృతి ప్రకటించాలని కోరారు. సమావేశంలో సంఘ నాయకులు జె.శాంతి కుమార్, పి.రోజా, కె.పొట్టియ్య, జి.రాజారావు, ఎ.సాంబమూర్తి, టి.శ్రీనివాసరావు, చింతా వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.



ఏపీటీఎఫ్ సమావేశంలో పాల్గొన్న నాయకులు

రైతాంగ సమస్యలపై కలెక్టర్‌కు వినతి

ఏలూరు (టూటౌన్): రైతాంగ, ప్రజా సమస్యలపై సోమవారం ఏలూరు జిల్లా కలెక్టర్, ఎస్పీలకు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, సీపీఐ నాయకులు వినతి పత్రాలను అందజేశారు. ఏలూరు జిల్లా ముసునూరు మండలం గుల్లపూడి, లోపూడి, చెక్కపల్లి లింగపాలెం మండలం కలరాయన గూడెం గ్రామాలకు చెందిన రైతులకు మొక్కజొన్న విత్తనాల కంపెనీల వారు నకిలీ విత్తనాలు ఇచ్చారని, దీంతో దిగుబడి రాక రైతులు తీవ్ర నష్టాలకు గురయ్యారని ఏపీ రైతు సంఘం ఏలూరు జిల్లా కార్యదర్శి రాయంకుల లక్ష్మణరావు సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, బీకేఎంయూ జిల్లా అధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. మొక్కజొన్న సీడ్స్ కంపెనీల ఆర్గనైజర్స్‌పై చర్యలు తీసుకొని రైతులకు న్యాయం చేయాలని కోరారు. జంగారెడ్డిగూడెం మండలంలో రైతు భూమికి సంబంధించి హక్కు పత్రాలు ఇప్పించాలని, చింతలపూడి మండలం మల్లాయగూడెం గ్రామ ప్రజలకు తాగు నీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు వరప్రసాదరావు ఆనంద్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు జేవీ రమణ రాజు ఉన్నారు.



కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

చర్మ వ్యాధులపై నూతన చికిత్సా విధానం



సదస్సులో పాల్గొన్న వైద్యులు

ఏలూరు రూరల్ : ఆశ్రం ఆసుపత్రి ఆవరణలో చర్మ వ్యాధుల నూతన చికిత్స విధానంపై సోమవారం సదస్సు నిర్వహించామని ఆశ్రం సీఈఓ డాక్టర్ కె.హనుమంతురావు ఓ ప్రకటనలో తెలిపారు. పలు రకాల చర్మ వ్యాధుల, చర్మంపై ఏర్పడ్డ కంతులు చికిత్స విధానంతో పాటు ఆపరేషన్ చేసే విధానం, బొల్లి, పుట్టు మచ్చలు తొలిగింపు అంశాలపై శిక్షణ ఇచ్చామని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ గుర్తింపు పొందిన ఈ కార్యక్రమంలో పలు ప్రాంతాల నుంచి వచ్చిన 176 మంది వైద్య విద్యార్థులు పాల్గొన్నట్టు తెలిపారు. కార్యక్రమంలో జనరల్ సర్జన్లు, అనస్థీషియాలజిస్టులతో పాటు ఆశ్రం మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ చేబ్రోలు శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ వేణుగోపాలరాజు, సూపరింటెండెంట్ డాక్టర్ శాంతయ్య, గ్రూప్ సీఈఓ రాజరాజన్ పాల్గొన్నారని వివరించారు.



చర్మ వ్యాధుల చికిత్స విధానాన్ని ప్రదర్శిస్తున్న దృశ్యం

పెద్దిరాజుకు కళాజాతరలో సత్కారం



పెద్దిరాజును సత్కరిస్తున్న దృశ్యం

ఉంగుటూరు: శ్రీశ్రీ కళా వేదిక ఆధ్వర్యంలో శని, ఆదివారాల్లో తాడేపల్లిగూడెంలోని బుద్ధాల కన్వెన్షన్‌లో ప్రపంచ తెలుగు సాహితీ కళాజాతర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉంగుటూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిరిమామిళ్ల పెద్దిరాజును సత్కరించారు. ప్రపంచ సాహిత్య సాంస్కృతిక రికార్డు నెలకొల్పడానికి నిర్వహించిన 24 గంటల పాటు నిర్విరామంగా సినీగేయాలు పాడినందుకు సత్కరించారు. గతంలో కూడా పెద్దిరాజు అమలాపురంలో 13 గంటల కార్యక్రమాన్ని నిర్వహించి భారత్ బుక్ ఆఫ్ రికార్డ్, ఆంధ్ర బుక్ ఆఫ్ రికార్డ్ సాధించారు.

హెచ్‌సీ శ్రీనివాస్‌కు ప్రశంస



కలెక్టర్, ఎస్పీల నుంచి ప్రశంసా పత్రం అందుకున్న హెచ్‌సీ శ్రీనివాసరావు

భీమడోలు: స్థానిక పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ సూరిశెట్టి శ్రీనివాసరావు ఉత్తమ సేవలకు ఏలూరులో సోమవారం కలెక్టర్ వెట్రీ సెల్వీ ప్రశంసా పత్రం అందించారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా స్థాయిలో ఏలూరులో నిర్వహించిన కార్యక్రమంలో సూరిశెట్టి శ్రీనివాసరావుకు కలెక్టర్ వెట్రిసెల్వీ, ఎస్పీ ప్రతాప్ శివ కుమార్‌లు ప్రశంసా పత్రం అందించి అభినందించారు. భీమడోలు పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇటీవల దొంగతనాలు, మిస్సింగ్ కేసులు త్వరితగతిన ఆయన చేధించారు. పోలీస్ స్టేషన్ సిబ్బంది శ్రీనివాసరావును అభినందించారు.

కల్లాల్లోనే ధాన్యం కొనాలి



మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్

ఏలూరు (టూటౌన్): రైతుల కల్లాల్లోనే ధాన్యం కొనుగోలు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కట్టా భాస్కరరావు, జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ ప్రభుత్వాన్ని కోరారు. ధాన్యం కొనుగోలు సమస్యలపై వారు స్థానిక అన్నే భవనంలో మాట్లాడారు. పంట పండించడానికి కంటే పంట అమ్ముకోవడానికి రైతు ఎక్కువ కష్టపడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రకృతి వైపరీత్యాల సందర్భంగా పంటను రక్షించుకొనేందుకు ఎటువంటి సౌకర్యాలు అందుబాటులో లేక అన్నదాత నష్టపోవాల్సి వస్తుందని వివరించారు. సామూహిక కల్లాలు, గ్రామీణ ప్రాంతాల్లో పంట నిల్వ చేసుకునే షెడ్లు నిర్మించాలని, సబ్సిడీపై టార్పాలిన్లు అందించాలని కోరారు. పంట సాగు చేస్తున్న కౌలు రైతుల పేర్లతోనే ధాన్యం కొనాలని, ఈ-క్రాప్‌లో పేర్లు నమోదు చేయాలని అన్నారు. తేమ శాతం వంటి నిబంధనలను సడలించాలని, రైతు నుంచి ధాన్యం కొన్న తర్వాత మిల్లులకు తరలించే బాధ్యత ప్రభుత్వ యంత్రాంగమే తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతు సేవా కేంద్రాల్లో నిర్ణయించిన తేమ శాతం, తూకం ఆధారంగా మిల్లు వద్ద ధాన్యం దిగుమతి చేసుకోవాలని కోరారు. నాణ్యమైన గోనె సంచులు అందించాలన్నారు. రైతు ధాన్యం 48 గంటల్లో సొమ్ములు చెల్లించేలా ముందుగా తగు నిధులు కేటాయింపు చేయాలని అన్నారు. ధాన్యం రవాణాకు రైతుల ఎడ్ల బండ్లను అనుమతించాలని విజ్ఞప్తి చేశారు.

ఆహార నాణ్యతలో రాజీ పడొద్దు

ఏలూరు (టూటౌన్): వసతి గృహాలు, చిల్డ్రన్ హోమ్‌లలో చిన్నారులకు అందించే ఆహారం విషయంలో రాజీ పడొద్దని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ సూచించారు. పోణంగి రోడ్డులోని రవితేజ చిల్డ్రన్ హోమ్, వట్లూరులోని గునెల్లా చిల్డ్రన్ హోమ్, హనుమాన్ జంక్షన్‌లోని ఆశాజ్యోతి విభిన్న ప్రతిభావంతుల గృహం, లైఫ్ గివెర్స్ చిల్డ్రన్ హోమ్, కొక్కిరిపాడు లోని షేర్, భోగాపురంలోని విన్ అవర్ నేటివ్ చిల్డ్రన్ హోమ్ం, కొప్పాకలోని సెయింట్ జాన్సన్ కేర్ హోంలను సోమవారం ఆయన సందర్శించారు. సంక్షేమ గృహాల్లో సదుపాయాలపై ఆరా తీశారు.

ప్రొటోకాల్ పాటించడం లేదు

భీమడోలు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ కార్యక్రమాలకు వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధుల విషయంలో ప్రొటోకాల్ పాటించడంలేదని ఎంపీటీసీ ముళ్లగిరి జాన్సన్ సోమవారం ఏలూరు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సర్పంచులు, ఎంపీటీసీలు, వార్డు సభ్యులకు గ్రామాల్లో జరిగే అభివృద్ధి పనులకు ఆహ్వానం ఇవ్వడం లేదని పేర్కొనఆనరు. కూటమి ప్రభుత్వం నాయకులతో కుమ్మక్కైన మండల స్థాయి అధికారులు, గ్రామ కార్యదర్శులు ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు తమకు సరైన పిలుపులు లేవని వివరించారు. ప్రజా సమస్యలను సమావేశాల్లో అడుగుతున్నామన్న ఉద్దేశంతో తమను ఆహ్వానించడం లేదని తెలిపారు. ప్రొటోకాల్ విషయంలో మండల స్థాయి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని కలెక్టర్‌ను ఆయన కోరారు.

అన్నసమారాధన

గణపవరం: స్థానిక చినరామచంద్రపురం కనకదుర్గమ్మవారి దసరా నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా సోమవారం ఆలయం వద్ద భారీ అన్నసమారాధన ఏర్పాటుచేశారు. తొలుత అమ్మవారిని పూజలు చేశారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఆలయ కమిటీ సభ్యులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.